క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకు, శాస్త్రీపురం ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ లబ్ధిదారులకు బుధవారం (నేడు) చెక్కులు పంపిణీ చేయనున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్ తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై చెక్కులు అందిస్తారన్నారు.

విద్యార్థులకు విందు భోజనం

శంషాబాద్ రూరల్: మండలంలోని పిల్లోనిగూడలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు జుర్కి రమేష్ మంగళవారం విందు భోజనం ఏర్పాటు చేశారు. తన తండ్రి లక్ష్మీనారాయణ వర్ధంతి పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రుక్కయ్య, స్థానికులు ఆనంద్‌కుమార్, సంకీర్తన, సాత్విక, సాయివర్ష, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పురస్కారం అందజేత

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం పంచాయతీకి జిల్లాస్థాయి పురస్కారాన్ని అందజేశారు. జిల్లాస్థాయిలో ఎంపికైన మల్కారం పంచాయతీ తరఫున సర్పంచు మాధవియాద గిరిరెడ్డికి మంత్రి సబితారెడ్డి పురస్కారం అందజేశారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, జెడ్పీటీసీ తన్వీరాజు, ఎంపీడీఓ వసంతలక్ష్మీ, ఉప సర్పంచు లలితజంగయ్య పాల్గొన్నారు.

సందడిగా స్నాతకోత్సవం



మోడల్స్ అందుకున్న విద్యార్థులు

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో స్నాతకోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమెన్, చైల్డ్ డెవలప్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ సరళ రాజ్యలక్ష్మి, డీన్ ప్రియా మనీష్, ప్రిన్సిపల్ సుధ హాజరైయ్యారు. ఈ వేడుకలో ప్రీ ప్రైమరీ విద్యార్థులను మెడల్స్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లలలోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. ఈ సందర్భంగా నర్సరీ, యూకేజీ విద్యార్థులు ఆటపాటలతో అలరించారు.

ఎంజీఐటీలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన చంద్రమోహన్‌రెడ్డి

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జుబ్లీహిల్స్ సహకారంతో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సేవా కార్యక్రమాలను నిర్వహించటంతో పాటు సమాజ స్థితిగతులను అవగాహన చేసుకునేందుకు జాతీయ సేవా సంస్థ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు సేవా దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు విజయలక్ష్మి, అరుణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు కల్పించాలి

శంషాబాద్: పట్టణంలో కొనసాగుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు మెరుగుపర్చాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు.ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా నాయకులు ఆనంద్ ఆధ్వర్యంలోని బృందం డిగ్రీ కళాశాలను సందర్శించారు. టాయిలెట్ లేకపోవడంతో పాటు బోధించే అధ్యాపకుల కొరత కూడా తీవ్రంగా ఉందని విద్యార్థులు వారికి వివరించారు. డిగ్రీకళాశాల ఏర్పాటు చేసిన ప్రభుత్వం సరైన విద్యనందించేందుకు మాత్రం చర్యలు చేపట్టడం లేదని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని కళాశాలలో వసతులు మెరుగుపర్చడంతో పాటు బోధన అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

పోలీసుల అదుపులో పలువురు



స్వాధీనం చేసుకున్న కారు

రాజేంద్రనగర్: గుప్త నిధుల కోసం ఇంట్లో తవ్వకాలు చేపడుతుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో రాజేంద్రనగర్ పోలీసులు దాడిచేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బుద్వేల్ పాత మున్సిపల్ కార్యాలయం పక్కనే గతంలో నిర్మించిన ప్రహరీ పురావస్తు శాఖ ఆధీనంలో ఉంది. దీని పక్కనే నాగులు అనే వ్యక్తి ఇంటిని నిర్మించి తన కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. రిటైర్డ్ ఉద్యోగి అయిన నాగులు మనమడు వినోద్ మొయినాబాద్ హిమాయత్‌నగర్ ప్రాంతానికి చెందినవాడు. వినోద్‌తో కొందరు మీ తాత ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయని పూజలు చేసి బయటకు తీస్తామని వెల్లడించారు. దీంతో 12 రోజుల క్రితం ఇంట్లో పూజలు నిర్వహించారు. అనంతరం



ఇంట్లో గుప్త నిధుల కోసం చేపట్టిన తవ్వకాలు

మూడ్రోజులుగా తవ్వకాలు చేపట్టారు. రాత్రి సమయంలో పూజలు నిర్వహించడం, ఉదయం తవ్వకాలు చేపడుతుండడంతో చుట్టూ పక్కల వారికి అనుమానం వచ్చి రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన రాజేంద్రనగర్ పోలీసులతో కలిసి సదరు ఇంటిపై నిఘా పెట్టారు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఫలక్‌నూమా, బషీర్‌బాగ్, హిమాయత్‌సాగర్ ప్రాంతాలకు చెందిన ఖదీర్, కృష్ణమోహన్, దివ్యాసా, హరిప్రీత్‌సింగ్, విశ్వనాథ్, కట్ట శివసాయి, రామకృష్ణతోపాటు వినోద్‌ను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి మూడు కార్లతో పాటు 16 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

అనుమానం రాకుండా విందు..

నాగులు ఇంట్లో 12 రోజుల క్రితం పూజలు నిర్వహించి విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో స్థానికులతో పాటు స్నేహితులు పాల్గొన్నారు. ఇంట్లో పూజలు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా విందు ఏర్పాటు చేసినట్లు నాగులు, వినోద్ వెల్లడించారు. దీంతో ఎవరికి అనుమానం రాలేదు. మూడు రోజులుగా మంత్రాలు, అరుపులు, కేకలు వేస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో గుప్త నిధుల విషయం బయటకు వచ్చింది.

మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలి



మెప్మా బజార్‌ను ప్రారంభించిన చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: మహిళలు స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాల్సిన అవసరం ఎంతో ఉందని మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువుల అమ్మకం కేంద్రం మెప్మా బజార్‌ను మర్రిచెట్టు సర్కిల్‌లో ఆయన వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రతి ఒక్కరికి ఉద్యోగాలు ఇవ్వటం సాధ్యం కాదని ఇలాంటి చేతి వృత్తుల ద్వారా అనేక ఉపాధి మార్గాలు ఉన్నాయని, వాటిని అధికారుల ద్వారా తెలుసుకుని మనకు అనుకూలంగా ఉన్న వాటిని ఎంచుకుని రాణించాలన్నారు. మహిళలు తయారు చేసిన అనేక వస్తువులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, స్థానికంగా ఉన్న వేలాది మంది వాటిని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. మహిళలు తయారు చేసిన వస్తువుల విక్రయాలకు మున్సిపాలిటీ పరిధిలో అనువైన స్థలాలను ఎంపిక చేసి స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బి.శ్వేతరవికాంత్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు జె.సిద్ధప్ప, జె.లక్ష్మీ, తాజుద్దీన్, మున్సిపల్ మేనేజర్ మల్లారెడ్డి, టీఎంసీ లక్ష్మీ, మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

భార్యాభర్తల గొడవ

రెండో అంతస్తు నుంచి దూకిన గృహిణి
పరిస్థితి విషయం

శంషాబాద్: భార్యభర్తల మధ్యన గొడవ చోటు చేసుకోవడంతో ఓ వివాహిత రెండో అంతస్తు నుంచి దూకిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దేవ్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం..ఖాజీగల్లిలో నివాసముండే సిరాజ్ అతడి భార్య అఫ్సాఫాతీమా సోమవారం సాయంత్రం గొడవ పడ్డారు. కొంత సమయం తర్వాత రెండో అంతస్తుపైకి ఎక్కిన ఫాతిమా కిందికి దూకేయడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. భర్త వేధింపుల కారణమని ఫాతిమా కుటుంబ సభ్యులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

రాజేంద్రనగర్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని అత్తాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు వనం శ్రీరామ్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో అత్తాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్ అందజేసి మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పట్టుదలతో చదువుకోవాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో చదువుకున్నప్పుడే సబ్జెక్టులకు సంబంధించిన జవాబులు బాగా గుర్తుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రంపల్లి యాదగిరి, శ్రీధర్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష ప్యాడ్స్ అందజేస్తున్న వనం శ్రీరామ్‌రెడ్డి

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన సత్యబాబు

మణికొండ: ప్రజల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ సి.సత్యబాబు అన్నారు. మంగళవారం ఆయన మున్సిపాలిటీ కేంద్రంలోని 17వ వార్డులో కౌన్సిలర్ ఉషారాణితో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనం తీసుకుంటున్న ఆహారంలో సమతుల్యత లేకపోవటంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, అందులో కంటి సమస్యలు ఉన్నాయన్నారు. కంటి సమస్యలు ఉన్న వారు సమీపంలోని కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు అందజేస్తారన్నారు.

ఎంజీఐటీతో స్కైరూట్ ఏరోస్పేస్ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలతో స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా చైతన్య భారతి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, స్కైరూట్ ఏరోస్పేస్ పరిశోధనా విభాగం ప్రతినిధి డాక్టర్ సీవీఎస్ కిరణ్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు ఏరోస్పేస్ మెటీరియల్స్ రంగంలో పరిశోధనాత్మక అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. డాక్టర్ సీవీఎస్ కిరణ్ మాట్లాడుతూ.. ఇదే కళాశాల నుంచి గ్రాడ్యుయేట్ పట్టాను స్వీకరించి తిరిగి అదే కళాశాలతో కలిసి పనిచేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ఆలయాలు సిద్ధం

మణికొండ: శ్రీరామనవమి పండగను పురస్కరించుకుని సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు దేవాలయాలు ముస్తాబవుతున్నాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని హనుమాన్ దేవాలయాలు, వాసవి వెల్ఫేర్ క్లబ్ ఆధ్వర్యంలో అలకాపూర్ టౌన్‌షిప్‌లోని మహాత్మాగాంధీ పార్కులో కల్యాణోత్సవాలను నిర్వహించనున్నారు. దాంతో పాటు మణికొండ గ్రామ హనుమాన్ దేవాలయం, క్వార్టర్స్ హనుమాన్ దేవాలయం, మైహోం అవతార్ పక్కన ఉన్న సంకటహర హనుమాన్ దేవాలయం, పంచవటి కాలనీలోని సీతారామాలయం, పుప్పాలగూడ అంజలిగార్డెన్‌లోని హనుమాన్ దేవాలయం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, పుప్పాలగూడ, నార్సింగి, నెక్నాంపూర్, మంచిరేవుల, గండిపేట, ఖానాపూర్, వట్టి నాగులపల్లి, కోకాపేట తదితర గ్రామాలలోని హనుమాన్ దేవాలయాల్లో శ్రీసీతారాముల కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయా దేవాలయాల కమిటీలు పిలుపునిచ్చారు.

అత్యంత సురక్షితమైన నగరాల్లో ఒకటిగా హైదరాబాద్

మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి స్పష్టీకరణ

రాయదుర్గం: దేశంలోనే అత్యంత సురక్షితమైన నగరాల్లో ఒకటిగా హైదరాబాద్ గుర్తింపు సాధించిందని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి స్పష్టం చేశారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ఏడీపీ ఐటీ సంస్థ సహకారంతో సైబరాబాద్ పోలీస్ విభాగం 83 సీసీటీవీ కెమెరాలను నానక్‌రాంగూడలో మంగళవారం ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నానక్‌రాంగూడ పరిసరాల్లో కమ్యూనిటీలను అతి దగ్గరగా పరిశీలించడానికి తద్వారా శాంతిభద్రతలను అదుపులో ఉంచడానికి, ఈ ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఏడీపీ సంస్థ ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఇలాంటి తరహాలోనే ఇతర సంస్థలు కూడా ముందుకొచ్చి సమాజహిత కార్యక్రమాలను చేపట్టాలని ఆమె సూచించారు. ఏడీపీ ఇండియా జనరల్ మేనేజర్ విజయ్ వేములపల్లి మాట్లాడుతూ.. తాము నివశిస్తున్న, కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రాంతంలో కమ్యూనిటీల పట్ల బాధ్యతతో వ్యవహరించడం ద్వారా ఏడీపీ వారసత్వం విస్తరించిందన్నారు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ.. రాయదుర్గం, గచ్చిబౌలి, మాదాపూర్ పరిధిల్లో 2,600 సీసీ కెమెరాలు, నేనుసైతం, ఇతర ప్రైవేటు సీసీ కెమెరాలు 30వేల వరకు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ఏసీపీ రఘునందన్ రావు, ఏడీపీ సంస్థ ఉన్నతాధికారులు డాక్టర్ విపుల్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో డీసీపీ శిల్పవల్లి, ఏడీపీ సంస్థ అధికారులు

క్లినిక్స్ ప్రారంభం



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న పూజిత పొన్నాడ

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కోకాపేటలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బొమ్మినేని దుర్గారాణి ఏర్పాటు చేసిన బొమ్మినేని క్లినిక్స్‌ను మంగళవారం సినీనటి పూజిత ప్రారంభించి మాట్లాడారు. గైనకాలజీ రంగంలో ఇరవై సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న డాక్టర్ దుర్గారాణి ఫైనాన్షియల్ జిల్లాలో క్లినిక్ ఏర్పాటు చేయటం శుభపరిణామన్నారు. అధునాతన సాంకేతిక లేజర్, సర్జికల్ పరికరాలతో ఉత్తమ ప్రమాణాలతో ఏర్పాటు చేయటంతో మహిళలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు.

త్యాగాలు చేసిన కుటుంబాన్ని వేధించొద్దు



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మణికొండ: దేశ స్వాతంత్రం నుంచి మొదలు రోడ్లు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రాజెక్టులు, విమానాశ్రయాలు లాంటి ఎన్నో మౌలిక సదుపాయాలను కల్పించి దేశాన్ని అభివృద్ధి బాటలో నిలిపిన గాంధీ కుటుంబాన్ని వేధించటం తగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని తొలగించటం, అతను ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడంపై మంగళవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు కె.అశోక్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సత్యాగ్రహ సంకల్ప దీక్షకు ఆయన హాజరై మాట్లాడారు. ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీలు దేశంకోసం తమ ప్రాణాలను పణంగా పెట్టగా దేశ ప్రధానమంత్రి పదవులను సైతం కాదని ప్రజల శ్రేయస్సుకే కృషి చేసిన సోనీయాగాంధీ, రాహుల్‌గాంధీలను అవమానించటం బీజేపీకి సిగ్గు చేటన్నారు. కేంద్రంలో కొనసాగుతున్న నియంతృత్వ ప్రభుత్వంలో వందలాది మంది నేరగాళ్లు ఉన్నా, వారిపై అనేక కేసులు ఉన్నా చర్యలు చేపట్టని బీజేపీ పార్టీ రాహుల్‌గాంధీపై మాత్రం ఆగమేఘాల మీద చర్యలు తీసుకోవడాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం..

దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలు బాగుపడ్డారని, దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు అవినీతి, అక్రమాలు, అమ్మకాలకే ప్రాధాన్యం ఇచ్చి పాలిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆరోపించారు. నార్సింగిలో నిర్వహించి దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వాలు మేలు చేశాయని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వాలను తెచ్చుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ యాదవ్, పాపిరెడ్డి, నవీన్, ఖలీద్, శేఖర్‌యాదవ్, సంజయ్‌యాదవ్, జితేందర్, విజయ్‌బాబు, దుర్గేష్ యాదవ్, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

బండ్లగూడ: వేసవి కాలంలో ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా జలమండలి అధికారులు తగు చర్యలు చేపట్టాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కార్పొరేషన్ వెస్టెండ్ కాలనీలోని వాటర్ బోర్డు కార్యాలయంలో మేయర్ మహేందర్‌గౌడ్ జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డితో పలు సమస్యలపై చర్చించారు. నీటి బిల్లులు, పెండింగ్‌లో ఉన్న నూతన వాటర్ పైపులైన్స్, జంక్షన్స్, ట్రయల్స్ తదితర వాటిపై సమీక్షించారు. అలాగే జలమండలి క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కలిసి నూతనంగా బైరాగిగూడ, ఎర్రకుంటలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక బిల్లులు ఉన్న వారు ఆందోళన పడవద్దని ఇప్పటి వరకు 300 ఉన్న కమర్షియల్ వారికి డొమెస్టిక్ చేశారని అధికారులతో మాట్లాడడం జరిగిందన్నారు. వేసవిలో ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి ట్యాంక్ పనులు తుది దశకు చేరుకున్నాయని ఇవి పూర్తయితే వెంటనే ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చంద్రశేఖర్, డీజీఎం మహేందర్‌నాయక్, క్వాలిటీ అధికారి జమీల్, మేనేజర్ నరేందర్ పాల్గొన్నారు.



నీటి ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

నీటిని పొదుపుగా వాడుకోవాలి



నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మణికొండ: సమస్త జీవరాశికి జలంతోనే జీవనం ఉంటుందని, దాన్ని పొదుపుగా వాడుకోవటంతో పాటు భూమిలో నుంచి తీసుకున్నంత నీటిని తిరిగి అందులోకి పంపాల్సిన బాధ్యత అందరిపై ఉందని జలమండలి మణికొండ డివిజన్ మేనేజర్ స్ఫూర్తిరెడ్డి అన్నారు. మంగళవారం మణికొండ మున్సిపాలిటీ 4వ వార్డు హుడా కాలనీలో ప్రజలకు నీటి పొదుపు, ఇంకుడు గుంతల ఆవశ్యకతపై సొసైటీ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్, ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ అనే ఎన్‌జీవో సంస్థతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి నీటి సంపు, ట్యాంక్ ఎంత అవసరమో అంతే అవసరంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి రోజు లక్షలాది బోర్ల ద్వారా భూమిలో నుంచి నీటిని తీసుకుని వదిలేస్తే రాబోయే రోజుల్లో నీటి సమస్య వస్తుందన్నారు. ఎవరికి వారు ఆలోచన చేసి ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎల్. వందన నగేష్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, ఎన్‌జీఓ సంస్థ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాయి, కాలనీలవాసులు వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, పీఎస్‌ఎన్ మూర్తి, సుగుణరాజు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో సత్తా

మణికొండ: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ లెవల్–2 పరీక్షా ఫలితాలలో మణికొండ శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. 1,3,4,5 బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు 32, ప్రత్యేక బహుమతులు 4, గోల్డ్ మెడల్స్ 48, మెరిట్ సర్టిఫికెట్లు 112 మంది విద్యార్థులతో పాటు మొత్తం 200మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటారని ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శివరామకృష్ణ, మస్తాన్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మణికొండ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జితేందర్

మణికొండ: కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా నెక్నాంపూర్‌కు చెందిన మెరుగు జితేందర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ హాజీని పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నియమించారు. మంగళవారం వారు మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్‌ను కలువగా వారిని ఆయన సన్మానించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో పార్టీ పటిష్టానికి పూర్తిస్థాయిలో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, నాయకులు బి.ముత్యాలు, కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



అధ్యక్షులను సన్మానించిన నరేందర్

అక్రమ నిర్మాణాలను ఆపాలి



శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న భూనిర్వాసితులు

రాయదుర్గం: ఖాజాగూడలోని సర్వే నంబర్ 27లో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, వాటిని వెంటనే నిలిపివేయాలని భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు 23 కుటుంబాలకు చెందిన భూనిర్వాసితులు శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 1960 నుంచి 1980 వరకు టెనెంట్‌గా ఉన్నామని, ఈ సందర్భంగా పంటలు కూడా పండించడం జరిగిందన్నారు. ఆ తర్వాత కొందరు కావాలని ఈ స్థలాల్ని కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంలో అధికారులు విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.